# సంతోషం సగం బలుపు

(గల్పిక)

కామేశ్వర్రావు తనకోసం తపించి పోతున్నాడని సీతకు తెలుసును. ప్రేమికులు తల్లకిందు మనుషులు కనుక, అతడు తనకోసం పడేబాధ ఆమూలాగ్రం అర్థంచేసుకుని ఆనందిస్తూ ఉంది సీత. తనని పెళ్ళాడమని అడిగిన మరుక్షణం ఒప్పుకుందామని ఆమె అభిప్రాయం. అతను ధనికుడైతే, అందగాడైతే, విద్యాధికుడైతే కావచ్చు. సీత అతన్ని అందుకు ప్రేమించలేదు. ఆమె అతని నాజూకు చూసి ప్రేమించింది. అంత నాజూకు ఆడవారిలోకూడా ఎరగదు సీత.

ఆఖరుకు తెగబడ్డాడు కామేశ్వర్రావు.

"సీతా, నువ్వు నన్ను ప్రేమించకపోతే ఆత్మహత్య చేసుకుంటాను. ఈ ముళ్ళమీద ఇక ఉండలేను. ఏదో ఒకటి చెప్పెయ్యి — నన్ను పెళ్ళాడుతావా, లేక ఏ నుయ్యయినా చూసుకో—"

సీత అతనినోటికి చెయ్యి అడ్డంపెట్టింది. ఇద్దరి వివాహమూ పరీక్షలు కాగానే — అంటే ఇంకా నాలుగు నెల్లకు — జరిగేటట్టు స్థిరపడ్డది. కామేశ్వర్రావుకంటే అదృష్టవంతుడు ప్రపంచంలో లేడు.

పరీక్ష లింకో నెల ఉన్నదనగా కామేశ్వర్రావును స్నేహితులు కాటామీదికెక్కించి గతమూడు మాసాలలో అతను నెలకు పది పౌనులచొప్పున పెరిగినట్టు కాగితమూ పెనసలూ అక్కర్లేకుండానే అంచనా కట్టారు.

నూటఎనభై పౌనుల మొగుడు తనకక్కర్లేదని సీత కామేశ్వర్రావుకు చెప్పటమేకాక ఒకనూటఇరవై పాటిఫ్వాణ్ణి చూసిపెళ్ళిచేసుకుంది.

ఒకనెలకల్లా కామేశ్వర్రావు సన్నగా, పొడుగుగా, నాజూకుగా, దిగులుగా తయారయినాడు మళ్ళీ.

---

# కథా రచన

(అల్పిక)

చిన్న తనంలో కథలంటే నాలుక పీక్కునేవాడు. నిద్రాహారాలు మాని కథలు చదివేవాడు.

కాల క్రమాన కథలు రాయటం మొదలుపెట్టాడు. గాండీవంలోనుంచి బాణాలు వెలువడే వేగంతో కథా పరంపర వెలువడింది.

వంటవాడికి వంటకాలు రుచించవు. కథలురాయటం మీద ఆసక్తిపుట్టిన కొద్దీ చదవటం అలవాటు తప్పింది.

రాసేకథలో క్రమంగా పటుత్వం తప్పింది. కథలు నానాటికీ దిగ నాసిల్లిపోతున్నై. ప్రజ్ఞకు పెనుగులాడుతున్నాడు.

"సరు కయిపోయింది!" అన్నారు నలుగురూ.

అయిపోయే దేముంది? కథాసాహిత్యం ఇతరత్రా వెలువడుతూనే ఉంది; కాని, పాపం, కథకుడు దాన్ని చదివేశక్తి పోగొట్టు కున్నాడు. దాని వెంట రాసేశక్తికూడా పోయింది.

---